# మ మ త

పద్దెనిమిది గదుల భవంతి, బాడ్మింటన్ కోర్టంత లో వాకిలి, అంతకు రెండింతలుగా దొడ్డి, వెరసి లంకంత గల కొంపలో బిక్కుబిక్కు మంటూ వున్న తామిద్దరికీ, ముఖ్యంగా ఆయన ఆఫీసుకు వెళ్ళినపుడు ఏకాకిగా ఉండే తనకు—తోడుగా ఉంటారనీ—

చిన్న పిల్లల ఆట పాటలతో, తప్పటడుగులతో, ఇల్లు కలకల లాడుతూ వుంటే తనకు ముద్దు, మురిపెము తీరుతాయనీ—

అడుగడునా, మేము నిన్నొదిలి పోలేమంటూ జ్ఞప్తి వచ్చి తన మనసును కలతపెట్టే గతకాలపు స్మృతులనుండి తనకు విముక్తి లభిస్తుందనీ—

ఆశించి, ఇంటిని రెండు భాగాలుగా విభజించి, ఒక భాగాన్ని కేవలం నామమాత్రమైన 'అద్దె'కు — ఇరవై రూపాయిలకు — ఇవ్వటానికి అంగీకరించింది జయమ్మ. అతను— అతనిపేరు శివరాజు—తమకేదో దూరపు బంధువు

అవుతాడని చెప్పేరాయన — సన్నగా, పీలగా ఉంటాడు. ఏదో ఆఫీసులో ఉద్యోగి. నెలకు రెండొందలు దాకా సంపాదిస్తాడట. అతని సతీమణి కమల—ముగ్గురు బిడ్డలతల్లి. పాపం ఎప్పుడూ ఏదో పనిలో ఉంటుంది. నవ్వుతూ పలకరిస్తుంది. నిష్కపటంగా మాటాడుతుంది. ఆ తల్లి తండ్రులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంటారు వాళ్ళ పిల్లలు. పెద్దాడు ప్రభు. ఎర్రగా, బొద్దుగా, చలాకీగా ఉంటాడు. నాల్గోక్లాసు కాబోలు చదువుతున్నాడు. రెండో వాడు—రాము - అన్న పోలికే. కాని అన్నకంటే చిలిపివాడు. వాడి చూపుల్లోనూ, చేతల్లోనూ చిలిపితనం మూర్తీభవించి ఉంటుందెప్పుడూ. మూడోది రాణి— మూడేళ్ళ పిల్ల, ముద్దులొలికే మొహం. 'రత్నాల్లాంటి పిల్లలు' అనుకుంది జయమ్మ—వాళ్ళను చూడటంతోటే. అనుకుని ఆ ముగ్గుర్నీ తదేకంగా, ఆప్యాయతతో లాలనతో ఎంతసేపు చూస్తూవుందోమరి, "బామ్మగార్రా ! నమస్తే చెప్పండి మరి" అన్న కమల మాటలతో తేరుకుంది. ముగ్గురు పిల్లలూ నమస్తే చెబుతుంటే జవాబుగా నవ్వింది జయమ్మ.

ఆపిల్లలు తనను 'బామ్మగారూ' అని, విశ్వనాథంగార్ని 'తాతగారూ' అని పిలుస్తుంటే మొదట్లో జయమ్మ మనసు చివుక్కుమంది—తను అప్పుడే బామ్మ కావడ మేమిటని. కాని తర్వాత తర్వాత అంతగా బాధ అనిపించలేదు. బహుశా వాళ్ళలా పిలుస్తూనే ఉంటంవలన దానికి అలవాటు పడిందో, లేక మొట్టమొదటిసారిగా తనకు పుట్టిన బిడ్డడు బ్రతికివుంటే

వాడీపాటికి ఒక ఇంటివాడు అయివుండేవాడనీ, వాడికి పుట్టిన పిల్లలు తనను బామ్మా అని పిలిచేవారనీ, అదృష్టావశాత్తు తనది బామ్మ వయసే నని వూహించి సరిపెట్టుకుందోమరి.

ప్రభు రోజూ ఉదయం ఏడుగంటలకు, అంటే బడికి వెళ్ళేముందు 'బామ్మా' అంటూ జయమ్మదగ్గరకు వస్తాడు. జయమ్మపెట్టే 'దేముని ప్రసాదం' తీసుకోకుండా ఏరోజూ బడికి వెళ్ళడు ప్రభు. ప్రభుతోపాటు రాముకూడా వస్తాడు. 'బామ్మా! నాకూకూడాపెట్టవా' అంటూ చిలిపిగా చూస్తాడు. 'బామ్మా! మరేమో నేనూ వస్తున్నారా అని చెప్తున్నా వినకుండా వీళ్ళిద్దరూ నాకంటే ముందు వచ్చేశారు చూడు' అని ఫిర్యాదుచేస్తూ వస్తుంది రాణి. నిజంగా రాణిలా అధికారం చెలాయిస్తుంది, దర్పమూ చూపిస్తుంది రాణి. దానిమాటలకు నవ్వుతూ జయమ్మ ముగ్గురికీ కొబ్బరిముక్కలు పెడ్తే, వాటిని కళ్ళ కద్దుకుని, ఆప్యాయంగా నోట్లోవేసుకుని బిలబిలమంటూ వెళ్ళిపోతారు వాళ్ళు.

మధ్యాహ్నం తీరిక సమయాల్లో జయమ్మ ఏదో పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటే బుద్ధిమంతుల్లావచ్చి ఎదురుగా కూర్చుంటారు రాము, రాణి. ప్రభు ఆ సమయంలో బడికి వెళ్ళిఉంటాడు. రాముకు కథలంటే ఎంతోయిష్టం. 'ఏదన్నా కథచెప్పు బామ్మా—నీకెన్నో కథ లొచ్చుట, తాతయ్య చెప్పాడు, కథలువచ్చీ చెప్పకుండా ఉండకూడదు బామ్మా' అంటూ చిలిపికళ్ళను ఇంతింతవిచేసి మాట్లాడ్తాడు. అడగాలేగాని చెప్పకుండా ఎలా ఉండగలదు జయమ్మ.

పాటలంటే చెవి కోసుకుంటుంది రాణి. అప్పుడప్పుడు అధ్యాత్మ రామాయణ కీర్తనలు పాడుకోవటం అలవాటు జయమ్మకు. తోచనప్పుడల్లా వచ్చి, 'పాట పాడవా బామ్మా' అని మారాంచేస్తుంది రాణి, జయమ్మ పాడే వరకూ.

ఆ ముగ్గురు పిల్లలూ ఆత్మీయులుగా ఆమెకు దగ్గర కావటానికి దోహదంచేసిన సంఘటనలలో కొన్నిమాత్రమే యివి

ఆ ముగ్గుర్నీ అంత ఆప్యాయంగా చూసుకుంటూ వాళ్ళతో అంత స్నేహంగా ఉంటున్నా, జయమ్మకు తృప్తి కలిగేదికాదు. అందుకు కారణం 'ఎంత చనువుగావున్నా పరాయిపిల్లలు పరాయిపిల్లలే' అనే భావనమాత్రంకాదు. గుమ్మడి పండుల్లాంటి ఆ పిల్లల్ని దగ్గరకు తీసుకోవాలనీ, చిదిమితే పాలుకారుతవన్నట్లుండే వాళ్ళ చెక్కిళ్ళనుచేతుల్తో స్పృశించి, వాళ్ళను తన హృదయానికి అదుముకోవాలనీ, చేతుల్తో వాళ్ళను ఎత్తుకొని తిప్పాలనీ ఉవ్విళ్ళూరేది.

మొదట్లో అలావాళ్ళను దగ్గరకు తీసుకోబోయే సమయంలో హఠాత్తుగా తనఆడబిడ్డ-అనసూయమ్మ - లోగడెప్పుడో తననుద్దేశించి అన్నమాటలు జ్ఞప్తికివచ్చి తన ప్రయత్నాన్ని విరమించుకొంది. అప్పట్నుంచీ ఆ పిల్లల్ని తనదగ్గరకు తీసుకొందామనుకున్నా భయంవేసేది. ఆడబిడ్డ మాటలు ఒక్కొక్క మాట—ఒక్కొక్క అనసూయమ్మగా వచ్చి అడ్డు నిలిచేవి. తనలో పొంగిపొరలే మాతృప్రేమపై విషబిందువుల్ని

చిలికినట్లుగా ఉస్సురనేది. నోరూరించే తియ్యని తినుబండారా లెన్నిటినో యెదురుగాపెట్టికూడా 'వాటిని నువ్వు ముట్టుకుంటే అవి విషంగా మారిపోతా'యని శపించినట్టుగా బా ధ ప డేది జయమ్మ ఆ సమయాల్లో.

అప్పుడప్పుడు తమంతతాముగా వచ్చి తన ఒళ్ళో కూర్చోవాలనీ, ముద్దుగా తనకాళ్ళకు చుట్టుకోవాలనీ రామూ గానీ రాణీగానీ ప్రయత్నిస్తే తను దూరంగా తప్పుకుని తాక గూడదమ్మా అనివారించేది. విధిలేక తనుఅలా వారించి నప్పుడు తనహృదయన్ని కసికొద్దీ ఎవరో పిండివేసినట్లు బాధపడేది.

తాకరాదని తను వారించినపుడు "ఎందుకుబామ్మా" అని వాళ్ళడిగితే తాను నిరుత్తరురాలయ్యేది. ఏ మ ని జవాబు చెప్తుంది. నేను పాపిష్టిదాన్ని నాచేతులు ........ అని ఏదో చెప్పి తన అసహాయతని వ్యక్తంచేయాలని అను కునేది. కాని అలా చేయలేకపోయేది.

"ఏందుకని బామ్మా" అని తామడిగిన ప్రశ్నకు జవాబు రానందుకు ఆచిన్నపిల్లలు చిన్నబుచ్చుకుని తమ భాగంలోకివెళ్ళి కమలను అడిగారు ఒ క సా రి "అమ్మా! బామ్మగార్ని తాకగూడదా!" అని. కమల క్షణంసేపు మౌనంగావుండి జవాబు చెప్పింది. "తాక కూడదు బాబు! పెద్దవాళ్ళు ఎప్పుడూ మడికట్టుకుని ఉంటారుకదూ" అని.

పిల్లలమనసు నొప్పించి నందుకే గాకుండా తనను గురించి తను పిల్లలతో మెలుగుతున్న వింతప్రవర్తనను గురించి

కమల ఏమనుకుంటుందోనని జయమ్మ క్రుంగిపోయింది ఆ క్షణంలో. ఏమనుకుంటేమాత్రం తనేం చేయగలదు? ఇదివరకు తననుగురించి ఎంతోమంది ఎన్నోవిధాలుగా అనుకున్నప్పుడు ఏం చేయగలిగింది గనుక— ఎవరూ చూడకుండా ఓపిక వున్నంతవరకూ ఏడవటంతప్పించి? ఒకరోజు రాత్రి....

రాణి నిద్రపోకుండా అల్లరిచేస్తుంటే శివరాజు కోపగించుకొని కసిరాడు. రాణి ఏడుస్తూ 'బామ్మదగ్గరకు వెళ్తా'నంటూ రాబోయింది కాబోలు, 'ఆగు! కదిలావంటే చంపేస్తాను. వచ్చి పడుకుంటావా లేదా' అంటూ శివరాజు రాణీని లాక్కువెళ్ళినట్లున్నాడు. తమభాగంలో పడుకుని ఇదంతా వింటున్న జయమ్మ నిస్సహాయంగా నిట్టూర్చింది. విశ్వనాథంగారుకూడా బాధపడి 'శివరాజుకు కోపమెక్కువ' అన్నాడు మెల్లిగా. 'బక్కకోపం' అనుకుంది జయమ్మ తనలో కసిగా.

శివరాజు అంటున్నాడు........'ఆవిడెందుకు పిల్లలంటే అంటీ ముట్టనట్లుంది. మనం ఉండటం యిష్టంలేదా ఏమిటి?'

జవాబుగా కమల కంఠం వినిపించింది "ఎవరు? జయమ్మగారా? పాపం ఆవిడనేమీ అనకండి, చాలా మంచిదావిడ. నవనీతంలాంటిది ఆవిడమనసు"

"మరెందుకు, పిల్లల్ని ముట్టుకోనివ్వదట. ప్రభు చెప్పాడు. మనమేమీ అంటరానివాళ్ళం కాదుగా?"

"దానికంతా పెద్దకథ ఉందిలెండి, తర్వాత చెప్తాను. వాళ్ళువింటారు, అరవకండి........"

జయమ్మ ఉలిక్కిపడింది. తన రహస్యాన్ని కమల కనిపెట్టిందా? తననుగురించి కమలకు తెలిసిన పెద్ద కథ ఏమిటో! చిన్నదైనా కమల ఎంతో తెలివిగలది. ఆవిడ మనసులాంటి మనసు అందరికీ వుంటే ఎంత బావుంటుంది! అప్పుడు తనకీ అపవాదు, మనఃక్లేశం ఉండేవికాదు, అనుకుంది జయమ్మ.

వాళ్ళమాటల్ని విన్న విశ్వనాథంగారు జయమ్మతో అన్నాడు "చూశావా ఎలా అనుకుంటున్నారో నిన్ను గురించి, ఇప్పటికైనా నీపద్ధతి మార్చుకో. పిచ్చిపిచ్చి అనుమానాల్ని పట్టుకొని వ్రేళ్ళాడినందువల్ల నీవు సాధించేదేమీ ఉండదు. పైగా........"

ఆయనమాటల్ని ఆపైన వినలేదు జయమ్మ. అవతల కమల మాటలపైకిపోయింది ఆమె మనసు.

"ఈసారి అబ్బాయో, అమ్మాయో!"

"ఎవరికి?"

".... .... ...."

"ఐ. సీ. ఇన్నాళ్ళనుంచీ చెప్పావు కాదేం........! వెరీ గుడ్....కాని....ఇక చాల్లే కమలా. ఈసారి నువ్వో నేనో ఆపరేషన్ చేయించుకొందాం"

"ష్ ష్"

జయమ్మ, విశ్వనాథంగారు ఒకరిమొహాలొకరు చూసుకొన్నారు. జయమ్మమొహంలో మెరపులా మెరిసిన

హాసరేఖ ఒకటి—ఆమెకు రెండుదశాబ్దాలదూరంలో దాగిన సంఘటనను కళ్ళకు కట్టినట్లుగా చూపింది. ఆ తర్వాత జరిగిన కొన్నిసంఘటనలు, వాటి పరిణామాలూ కళ్ళముందు కదలాడేయి....

కాపురానికొచ్చిన మూడోసంవత్సరంలో....

తను తల్లి కాబోతున్నట్లుగా ఆయనకుచెప్పినప్పుడు....

విశ్వనాథం ఆనందంతో జయను ఉక్కిరి బిక్కిరి చేశాడు. జయమ్మ పొంగిపోయింది. తనజీవితం ఇక నందన వనమే ననిపించింది. అవునుమరి—తన కింకేం తక్కువ?

ఆనాడు ఎంతగా పొంగిపోయిందో, తర్వాత అంతగా కృంగిపోయింది జయమ్మ—పుట్టినబిడ్డ పురిటి నీళ్ళుకూడా పోసుకోకుండా పోయినందుకు.

పుట్టిన సంతానం బ్రతుకకపోవటం అటు కన్నవారింట్లోను, ఇటు అత్తవారింట్లోనూఎరుగరు. తనతల్లికి తాము ఎనిమిదిమంది కూతుళ్ళు, తనకు ఐదుగురు అన్నదమ్ములూనూ. పెద్దన్నయ్య కిప్పటికి ఏడుగురు సంతానం. అందరూ బంతుల్లా పెరిగారు. అలాంటిది "ఎవ్వరికీలేని ఆనవాయితీ నీ కెక్కడొచ్చిందే"అని వాపోయింది తల్లి, పుట్టిన రెండోబిడ్డ కూడా పోయినప్పుడు, నిస్సహాయమైన నిట్టూర్పే జవాబుగా చెప్పింది జయమ్మ.

ఆతర్వాత........దేవకికిమల్లే ఏడుగురుపుట్టేరు. ఐనా విధి వారిపాలిటికి కంసుడయ్యాడు. దేవకి అష్టమగర్భం

కంసునిపాల పడలేదు. తనకూ అలాగే జరుగుతుందేమోనని ఆశపడింది జయమ్మ. కాని అంత అదృష్టంపట్టలేదు. అసలు గర్భమే ధరించలేదు మళ్ళీ.

"ఏం చేస్తాంలే....బిడ్డల్ని పెంచే అదృష్టం నీకులేదు. ఎవరు చేసినకర్మ వారు అనుభవించకపోతే ఎలా ?" అని నెమ్మదిగా అంటించేది—ఆడబడుచు అనసూయమ్మ.

సుశీలకు మళ్ళా మగపిల్లవాడు పుట్టేడని విన్నప్పుడు జయమ్మ ఎంతో సంతోషించింది. సుశీల తనకు చెల్లెలు. దానికిది నాల్గోకాన్పు. పోయినసారి తను వాళ్ళఊరు వెళ్ళినప్పుడు చూసింది. దానిపిల్లలు గుమ్మడి పండ్లులా ఉంటారు. తను ఎంతో ముచ్చట పడింది— ఆపిల్లల్ని చెల్లెలి సంసారాన్ని చూసి. అంతరాంతరంలో రవ్వంత అసూయకూడా మొలకెత్తక పోలేదు.

ఆ అసూయ శాపంగా పరిణమించిందో ఏమో, ప్రసవించిన పదిరోజులులోనే పసికూనను వదలి పరలోక గతురాలయింది సుశీల. చెల్లెలి అంత్యక్రియలకు వెళ్ళినప్పుడు ఆ పిల్లల ఆక్రందనలు, తండ్రి బేలతనము జూసి బెంబేలు పడిపోయింది జయమ్మ. అక్కడే వుండిపోయి ఆ పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతూ ఉండాలనిపించేటంతటి జాలి నిండింది హృదయం నిండా. కానీ, అది సాధ్యమా ?

జయమ్మ ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే ఓ పండు ముత్తైదువ గోపాలాన్ని పలుకరిస్తూ అంది, 'పూరుకో నాయనా గతించినదానికోసం కన్నీరు పెట్టటం మంచిపనికాదు నీ కే

మంత వయసు ముదిరిందని— మళ్ళీ పెళ్ళి చేసుకో. మగ వాడివి. పిల్లలతో ఎలా వేగగలవు? అప్పటి దాకా ఈ చంటాడ్ని సాకేమార్గం ఆలోచించు. కొంత కాలంపాటు ఈ పసికందుని పెంచే బాధ్యత స్వీకరించే వారెవరూ లేరా నీవేపు?'

జయమ్మకు అనిపించిందప్పుడు, 'ఈ చంటాడ్ని తానే ఎందుకు తీసుకు పోగూడదూ' అని. కాని ఆమాట తానుగా చెప్పలేక పోయింది. తను అడిగితే అంగీకరించ వచ్చు. అంగీకరించక పోవచ్చు. తనకు ఏడుగురు సంతానం పుట్టిపోయారని, తనహృదయం పిల్లలకోసం తపించిపోతోందని గోపాలరావుకు తెలుసు. తెలిసినా, ఈవిడ దగ్గర పిల్లలు ఆనవాయితీగా పోతున్నారని సంకోచిస్తాడేమో. ఆకారణం కాకపోయినా మరేకారణం వలన అతనంగీకరించక పోయినా తన హృదయం ఎంతో క్షోభిస్తుంది.

చివరకు గోపాలమే ఆమెను అర్థించాడు. "నీవుతప్ప నా కెవరున్నారు వొదినా, చెల్లెలు పోగానే బాంధవ్యం చెల్లిపోయిందని భావించకు. వీడి సంరక్షణా భారం వహించా వంటే చాలు. పెద్ద పిల్లలతో నేనేదో తంటాలు పడతాను కాదనకు" అని.

తన కంతకన్నా కావాలిసిందేముందనిపించింది జయమ్మకు. వెంటనే ఆ పసికందును తీసుకుని వచ్చేసింది. వాడే తనకు అష్టమపుత్రుడనుకుంది. అయితే తనిప్పుడు దేవకి కాదు. దేవకి చనిపోయింది. గర్భశోకాన్ని భరించలేక

పోయి కాలగర్భంలో దాగింది. తనిప్పుడు యశోద. నల్లకృష్ణుడ్ని పెంచే తల్లి. వాడివల్ల తనకు, తన యింటికి నిండుతనం చేకూరింది. 'తనకు సంతానం నిలువలేదే' అనే దుగ్ధ తన దరి కిప్పుడు రావటంలేదు. నలుగురిలోనూ తనకు గౌరవం, మర్యాద లభ్యమవుతున్నాయి. తల్లి కంటే మిన్నగా మురళిని ప్రేమిస్తూ, లాలిస్తూ పెంచుతోంది. మురళే తన లోకం.

కానీ, మురళికి ఈ లోకం నచ్చలేదు. ఈ లోకానికి ఎందుకు వచ్చానా అని బాధ పడ్డాడు. ఒకరోజు ఉన్నట్టుండి ఈ లోకం వదిలిపోయాడు.

జయమ్మకు లోకం చీకటైంది. కళ్లు కనిపించక కొట్టు మిట్టాడింది. కళ్ళు కనిపించేసరికి అంతా శూన్యమైంది. మురళి, యశోద, మర్యాద, గౌరవం అన్నీ కలలోలా కరిగి పోయాయి. ఆమెకు హృదయ చలనం ఆగిపోయినట్లైంది.

మురళి మరణం ఆమెను మూడునెలలు మంచం దిగకుండా చేసింది. అప్పుడే గోపాలరావు వచ్చాడు. అతనికి మొహం చూపలేకపోయింది జయమ్మ. "ఇలా జరుగుతుందని కలలోకూడా అనుకోలేదు. పెరిగి పెద్దవాడై నీకు సంతానం లేని లోటు తీరుస్తాడని ఆశించానేగాని, మూడేళ్ళపాటు పెంచిన మిమ్మల్నీ, నన్నూ అన్యాయం చేస్తాడనుకోలేదు" అని గోపాలరావు కంటతడి పెట్టినప్పుడు "నా మురళిని నీవే చంపేవు" అని ఆరోపించినట్లుగా తోచింది జయమ్మకు.

దొడ్లో వేసిన కొబ్బరిచెట్టు మట్టలు యింకా తలను తాకుతూ నేవున్నాయి. దానితోపాటు నాటిన ఎదురింటివారి

కొబ్బరిచెట్టు వంద కాయల కాపును దింపి, మరో కాపును పూత తొడిగింది. 'మీ కొబ్బరి చెట్టు మరుగుజ్జుదిలా వుంది, ఇక పెరగదేమో' అన్నపూర్ణ మాటలకు తన ఆడపడుచు అనసూయమ్మ ఇలా అంది, "నీకు తెలీదా అన్నపూర్ణా! అలాఅడుగుతావు, దాన్ని నాటిందెవరనీ?"—'ఎవరూ? జయమ్మగా' — 'మరింకేం. దాని చేతిచలువకు ఏబిడ్డ ఎదిగింది గనుక— చెట్టు ఎదగటానికి'

జయమ్మకు చెళ్ళున చరచినట్లయింది. కూర్చున్నకుర్చీ విరిగి భూమి పగిలి తను పాతాళంలోకి కృంగిపోతే ఎంత బావుండు ననిపించింది. తనవి పాపిష్టిచేతులు. తనచేతులతో పెంచిన ఒక్కబిడ్డడు బ్రతకలేదు. ఆ సంగతి తెలిసికూడా తను మురళిని ఎందుకు తీసుకువచ్చింది? మురళిని తను తీసుకురాకుండా వుంటే వాడిదిఅల్పాయువు కాకపోయేదేమో ననిపించింది.

ఒకవ్యక్తిని పదిసార్లు "నీవుదొంగ, నీవుదొంగ" అంటే అదిఅబద్ధమైనా నిజమేనేమోననే జంకు కలుగుతుంది ఆతనిలో. జయమ్మలోకూడా అలాంటి భయమేప్రవేశించింది. నిజంగా తనలో పిల్లల్ని సాకి పెద్ద చేయులేని అనర్హత ఉండే మోననిపించింది. ఒక్కొక్కరి 'హస్తవాసి' అంటారిదేనేమో! తనచేతులు, తనమనసు అంత పాపిష్టివి కాబోలు అనుకుంది. అలా అనుకున్నప్పటి నుంచీ ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. సంతానవతులై తమ సంతానపు ముద్దు ముర్రిపాలతో తమ మాతృత్వాన్ని తరింపచేసుకున్న మాతృమూర్తు

లను చూసినప్పుడల్లా మనస్సు చివుక్కుమనేది ఆ మెకు. నేరంచేసిన దోషిలా తల వంచుకునేది. నలుగురిలో మాట్లాడాలన్నా, నలుగురితో కలసి తిరుగుదామన్నా వారు తనలోని నేరాన్ని — తనకుగల అనర్హతను, ఎత్తి చూపుతారేమోనని భయం వేసేది.

"మనసులో ఏవేవో వూహించుకుని మానసికమైన అస్వస్థతను పెంచుకుంటూ నీకునీవు ద్రోహం చేసుకోవటమే గాకుండా నాకూ ద్రోహం చేస్తున్నావ్ జయం" అని విశ్వనాథంగారంటే నిజమేనేమో అనుకుంది జయమ్మ.

కొందరికి సంతాన యోగమే ఉండదు. ఆ అదృష్టం ఉన్నా కొందరికి సంతానమే నిలువదు. మరి కొందకిరి నిలిచినా ఆ సంతాననం నిత్యం ఏదోవ్యాధితో పీడింపబడుతూ, పెంచే తలిదండ్రులకు, చూచే పొరుగువారికీ అసలు ఈ సంతానమే వద్దురా భగవంతుడా అనిపించేంతటి బాధను కలిగిస్తారు. ఇదంతా భంవంతుని లీలా వినోదమా!. ఒకరి కర్మకు మరొకరి కర్తృత్వమని ఉండనే ఉంది. నాకుపుట్టిన ప్రతిశిశువు అల్పాయువుతోనే పుట్టింది. అంతేగానీ నా పెంపకంవలన, నాచేతిచలువ వలనవారికి ఆయువు తగ్గిపోవటం లేదని మనసును సరిపెట్టుకుంది జయమ్మ. సరిపెట్టుకొని మామూలుమనిషిగా తిరుగ నారంభించింది. అలాతిరుగుతూ దొడ్లోకి వెళ్ళినప్పుడల్లా కొబ్బరిచెట్టు మట్టలు తలకు తగులుతూనేఉన్నాయి. అప్పుడు ఆడబడుచు అనసూయమ్మ మాటలు గుర్తుకువస్తూనేఉన్నాయి. చెట్టు పెరగటానికి చేతి

చలువకు సంబంధ మేముందసలు ? చెట్టు పెరగడానికి భూమికి సరిపడే లవణాలు తగుపాళ్ళలో ఉండాలి. అలా లేకపోతే చెట్టు చచ్చిపోతుంది. ముఖ్యంగా కొబ్బరి చెట్టుకు భూమిలో చట్టు తగిలితే పెరగదు. ఈ నేలకు సరి పడే చెట్లని నాటితే ఎందుకు పెరగవు ? ఇలా అనుకోగానే జయమ్మకో ఆలోచన వచ్చింది. తన చేతిమీదగా నాటిన చెట్టుకూడా పెరిగి పెద్దదై ఫలవంతమౌతుందని నిరూపించాలి అనిపించింది. తను కాపరానికొచ్చేసరికి నూతికటువేపుగా మంచి గుమ్మడి పాదు ఉండేది. ఇటు వేపుగా బొప్పాయి చెట్టుండేది. పచ్చగా నిగనిగలాడే బంగారపు ముద్దల్లాంటి గుమ్మడి పండ్లు, తియ్యని బొప్పాయి పండ్లు ఎన్నో కాచేవి ఆ రెండు చెట్లూను. ఇప్పుడు మళ్ళీ పెద్దవై కాయలుకాస్తే తనకొచ్చిన అపవాదు తొలుగుతుంది అనుకొని వాటిని నాటింది.

కమల శివరాజు ఆయింటికొచ్చేటప్పటికి గుమ్మడి పాదు ఏపుగా పెరిగింది. దొడ్డిఅంతా అల్లుకుంది. బొప్పాయి చెట్టు నింగిని చూస్తానంటూ పెరుగుతోంది.

ఆ రెండు చెట్లు పుష్పించాలి. పుష్పించి ఫలించాలి. అప్పుడు తనమనసు ఆనందంతో నిండుతుంది. తనకు కలిగిన అపవాదు కేవలం అపవాదేనని తృప్తి పడుతుంది. ఆ శుభ ఘడియ ఎప్పుడు వస్తుందోనని ప్రతిరోజూ నిద్రలేవగానే ఆచెట్లు వైపు చూస్తుంది జయమ్మ.

*　　*　　*

జయమ్మ ఆరోజు వంట చేసుకుంటూ వుండగా "బామ్మా ఏం జేస్తున్నావ్" అంటూ రామూ వచ్చాడు.

"వంటజేస్తున్నా బాబూ!" అని సమాధానం చెప్పింది జయమ్మ.

"బామ్మా మరేమో నిన్న సాయంత్రం ఎక్కడి కెళ్ళావ్ ?"

"ఎందుకుబాబు ?"

"నిన్న కోతి వచ్చిందిగా. నువ్వు చూడలేదు. బలే బావుందిబామ్మా! ఎంచక్కా గంతులేసిందని. దానికి నేను వేరుశనగకాయలు పెట్టేను. బలేతింది." అన్నాడురాము —గొప్ప ఘనకార్యం జేసినవాడిలా కళ్ళింతింతవిచేసి.

"నిజంగానా" అన్నది జయమ్మ వాడి అమాయక త్వానికీ. సంతోషానికీ తాను దోహదం చేయాలని.

"నిజంబామ్మా! వేరుశనక్కాయలు తిన్నతర్వాత ఇంటి మీదికెక్కింది. అక్కడ్నుంచీ గోడమీదకి దూకింది. గోడమీద నుంచీ దిగి బొప్పాయి చెట్టెక్కింది"

"పాపం దానికి తెలీదేమో ఆచెట్టు యింకా కాయలు కాయటం దనీ, ఆశుభసమయం కోసమే నేనెదురు చూస్తున్నాననీ" అని అంటూ బిందెతీసుకొని నూతి దగ్గరకి బయలు దేరింది.

ఆవిడమాటలు తనకర్థం కాకపోయినా, తనుచెప్పింది

విని తనకేదో జవాబు చెప్పింది కదా అని తృప్తిపడి ఆవిడ ననుసరించాడు రాము.

—" బామ్మా నే చూడు "

నూతిలో చేదను లాగుతున్నదల్లా అటువేపు చూసింది జయమ్మ.

రాము బొప్పాయి చెట్టుపై కెక్కుతున్నాడు. జయమ్మ గుండె దడదడ లాడింది. అక్కడ్నుంచీ పడితే ఇంకేమైనా ఉందా ? క్రింద నల్లని కోసు రాళ్ళు గూడా వున్నాయ్ అనుకుని చేతిలోని చేదనువదిలి 'రామూ' అంటూ అటు పరుగెత్తింది.

మనిషెత్తుకు పైన ఎక్కిన రామూను దించుదామని చేతులు చాపింది జయమ్మ. తన ప్రయోజకత్వానికి తనే మురిసి పోతున్న రామూ వెంటనే ఆమె చేతుల్లోకి రాలేదు.

'షాక్' తగిలినదానిలా తన చేతుల్ని వెనక్కు లాక్కుంది. తను రామూని ముట్టుకోగూడదు. తనచేతులు పాపిష్టి చేతులు. కాదని నిరూపించటానికి తనునాటిన చెట్లింకా పుష్పించలేదు. అందుకని రామూని ముట్టుకో గూడదు.

కెవ్వుమన్న రామూ కేకతో జయమ్మ ఆలోచన చెదరిపోయింది. కళ్ళముందు జరిగిన ఘోరానికి తల్లడిల్లి పోయింది. ఈఘోరం తను రామూని ముట్టుకున్నందువలన జరిగిందే.

రామూ కేకవిని ఇంట్లోనుంచీ కమల, శివరాజు, విశ్వనాథంగారూ—అందరూ వచ్చారు. " ఏం జరిగింది పిన్ని

గారూ" అంటూ కమల రామూను తీసుకుంది, తనచేతుల్లోకి. జయమ్మ జవాబు చెప్పలేదు. రెండుచేతుల్లోనూ ముఖాన్ని దాచుకుంది.

ఏ రాళ్ళ మీాదైతే పడతాడని భయపడి జయమ్మ రామూని దింపబోయిందో ఆ రాళ్ళమీాదే పడ్డాడు రామూ. తనను దింపటానికి బామ్మ చేతులుజాపిందికదా అని పట్టువదలి రాముం తనను బామ్మ దింపిందో మరేమైందో తెలియని అచేత నావస్థలో ఉన్నాడు.

ఎంత ప్రయత్నించినా గాయంనుండి రక్తం స్రవిచటం ఆగలేదు. అందరికీ ఆదుర్దా ఎక్కువైంది. అందరూ కలసి అతన్ని హాస్పటల్‌కు తీసికెళ్ళారు. జయమ్మ నెవరూ రమ్మనలేదు. తానుగా వెళ్ళటానికి ఆమెకు ధైర్యం చాల లేదు. అక్కడికక్కడే కుప్పలా కూలి పోయిందామె.

వీధిలో కుక్క ఒకటి ఏడుస్తోంది. ఆ ఏడుపు వినే సరికి జయమ్మ శరీరం జలదరించింది. ఎవరికే కీడు మూడు తుందోనని భయపడింది. రామూకేమీా ప్రమాదం సంభ వించదుకదా? అనుకుంది. ఏమో—ఏంజరుగుతుందో! చెట్టు ఎక్కిన పిల్లవాడు క్రింద రాళ్ళమీాద పడతాడేమోనని తన మనసెందుకు శంకించాలి? వాడ్ని దింపే ప్రయత్నంలో తను వాడ్ని ఎందుకు తాకాలి? అసలు తను దించాలని ప్రయత్నించకుండావుంటే వాడంతట వాడు దిగేవాడేమో— ఈ ఆలోచన రాగానే తనమీాద తనకు ఏవగింపూ, కోపమూ కలిగాయి. రామూ పడిన ప్రదేశాన్నీ, అక్కడి రాళ్ళ

గుట్టకూ చూసింది. తన చేతుల్నీ చూసుకుంది. ఆ చేతుల మీద కోపం కట్టలు తెంచుకుంది. ఆ చేతుల్ని బలంగా ఆ రాళ్ళగుట్టకేసి బాదింది. జివ్వుమనే బాధ కోపాన్ని మింగేసింది. మళ్ళీ చేతుల్ని చూసుకుంది. కుడిచేతి మధ్య వేలు చితికి రక్తం చిమ్ముతోంది. రాళ్ళగుట్టపైపడి రాము రక్తంతో తనరక్తం కలిసిపోయింది.

పొద్దుటినుంచీ కూర్చున్న జయమ్మనుచూసి విశ్వనాథంగారు నిర్విణ్ణులయ్యారు. "జయం" అన్నారాయన. జయమ్మ భర్తముఖంలోకిచూసి, "వచ్చారా! రామూఏడి? రామూ కెలావుంది?" అని అడిగింది ఆదుర్దాగా.

విశ్వనాథంగారు నిట్టూరుస్తూ, "ఇప్పుడే కట్టుకట్టేరు. గాయం బలంగా తగిలింది. సాయంత్రిందాకా స్పృహ రాకపోవచ్చునన్నారు."

'భగవంతుడా' అనుకుంది జయమ్మ బాధగా.

"లేచి త్వరగా వంటకానివ్వు. అలా దిగాలుపడి కూర్చుని చేయగలిగిందేముంది. అలా బజారువరకూ వెళ్ళొస్తాను" అంటూ వెళ్ళారు విశ్వనాథం.

విశ్వనాథంగారు వెళ్ళారని నిర్ధారించుకున్నతర్వాత జయమ్మ నెమ్మదిగా లేచింది. నూతివద్దకు వెళ్ళి నీళ్ళతో చేతులూ కాళ్ళూ కడుగుకుంది. దోసిలిలో నీటిని తీసుకుని ముఖంకూడా కడుగుకొంది. ముఖాన్ని పమిటిచెంగుతోనే తుడుచుకుంటూ లోపలికి వచ్చి అల్మారులోని కుంకుమబరిణె

తీసి అద్దంలేకుండానే బొట్టును దిద్దుకొంది. వ్రేలికి అంటు కున్న కుంకుమను పాపిట్లో రాసుకుంటూ పడమరవైపుగది లోకి నడిచింది.

దివ్యలోకాలన్నీ ఆ గదిలోనే ఉన్నవా అన్నట్లుగా వుంది ఆగది. గదికి ఎదురుగా అట్టలతో ఏడుకొండలుగ అమర్చబడి ఆపైని ఏడుకొండలవాని మంగళరూపం నిలువబడి వుంది. ఆయనకన్నుసన్నలనే తా మున్నామన్నట్లుగా ఒక వైపు భోళాశంకరుడు, సీతారామలక్ష్మణులు, మరోవైపు పంచముఖ వీరాంజనేయస్వామి, దుర్గ, కుమారస్వామి, రాధా కృష్ణులు వేంచేసిఉన్నారు. ఎవరికితగిన పూజా ద్రవ్యాలు, నివేదనావస్తువులు ఎక్కడికక్కడ సిద్ధపరుపబడి ఉన్నాయి. జయమ్మ దీపారాధన చేసింది. అగరువత్తులను వెలిగించింది. అందరినీ మేల్కొల్పుతానన్నట్లుగా ధూమం గదిఅంతా అలుముకుంది. అందరినీ పేరుపేరునా సంబోధిం చింది జయమ్మ. చేతులు జోడించింది. "నేనేమి అపరాధం చేశాను ? మీలో ఎవరికి ఏలోటు కలిగించాను. మీరంతా కలిసి నాపై కక్షకట్టేరా స్వామీ ? ఈ ఉపద్రవ మేమిటి ? రామూ నాపంచప్రాణాల్లోనూ ఒకప్రాణంగా ఉంటున్నాడు. వాడ్ని నానుండి దూరంచేస్తారా ? వద్దు. మిగతా నానాల్గు ప్రాణాల్నీ తీసుకోండి. రాముని రక్షించండి" అని వేడు కుంది. ప్రాధేయపడింది.

ప్రమిదల్లోని జ్యోతులు నిశ్చలంగా వెలుగుతూనే ఉన్నాయి. దేవతా విగ్రహాలు యథాతథంగా నిల్చునే

ఉన్నాయి. అగరువత్తులధూమం మాత్రం మాలోకం వేరే ఉందంటూ పైపైకి వెళ్తోంది.

—సాయంత్రం కావస్తోంది. రామూ తలనుండి స్రవించిన రక్తపు మడుగులా పశ్చిమాకాశం ఎర్రబడింది. విశ్వనాథం గారు అప్పుడే రిక్షాదిగి విచారంగా లోపలికివచ్చేరు. ఆయ నను చూస్తూనే జయమ్మ అడిగింది "రామూకి స్పృహ వచ్చిందా" అని.

"ఇంకా రాలేదు. ఎక్కువగా రక్తం నష్టం కావటం వలన పరిస్థితి విషమించింది జయం. రామూకి ఇప్పుడు రక్తం కావాలి. కాని...."

"కాని? ఏమిటీ, చెప్పండీ!"

"రామూకి సరిపడే రక్తం ఇప్పుడు అందుబాటులో లేదుట"

"వాడి తల్లిదీ, తండ్రిదీ...."

"ఎవరిదీ సరిపడలేదు. నారక్తంగూడా పరీక్షచేశారు. లాభం లేకపోయింది. ఆరకం బ్లడ్ డోనార్స్ ఈవూళ్ళో ఇద్దరే వున్నారుట. కానీ వాళ్ళు అందుబాటులోలేరు."

* * *

హాస్పటల్లోని తెల్లటి బెడ్ మీద మాగన్నుగా పడు కునివున్న రక్తదాత్రి జయమ్మకు తమదొడ్లో గుమ్మడిపాదు పుష్పించిఫలించినట్లుగాను, బొప్పాయిచెట్టు బోలెడుకాయలు కాసినట్లుగానూ కలవచ్చింది. *